క్లుప్తంగా

ఉత్సవాలకు నిధులు కేటాయించాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుక్కుగూడ: ఆషాఢ మాసంలో మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే మాంకాలమ్మ బోనాల ఉత్సవాలకు నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఏ.వాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ మాట్లాడారు. ప్రతి ఏడాది ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటారన్నారు. నిధులు కేటాయించి 15వ వార్డులో ఉన్న అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో బుచిరెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ


విద్యార్థినులకు ఐడీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు

కందుకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మోటి రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఐడెంటీ కార్డులు(గుర్తింపు) తయారు చేయించి పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి చిందం ప్రశాంత్, కోశాధికారి కందడి శ్రీనివాస్, నాయకులు కృష్ణ, వినోద్, కుమార్, సురేష్, జగదీశ్వర్, అనిల్, రవి, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు మంజులతారెడ్డి, లక్ష్మీదేవి, జ్యోతి, గోపాల్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పండల లక్ష్మీపతిగౌడ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన కందికంటి సుధాకర్‌గౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సిఫారసు మేరకు పంపగా రూ.60 వేలు చెక్కు మంజూరైంది. దీంతో బుధవారం చెక్కును ఎంపీ రాజేందర్ బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కొంగరకలాన్‌వాసులు, నాయకులు పాల్గొన్నారు.

వ్యసనాల బారిన పడొద్దు

సీఐ నందీశ్వర్‌రెడ్డి


విద్యార్థులతో సమావేశమైన సీఐ, ప్రిన్సిపాల్

యాచారం: పట్టుదలతో చదవాలి, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాల స్థాయిలో ఎంతో కష్టపడి చదవాలని సూచించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. ఉద్యోగాలతోనే కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని లబ్ధిదారులకు ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్ సూచించారు. ముకునూర్ గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని హౌసింగ్ ఏఈ వైష్ణవితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జంగయ్యగౌడ్ మాట్లాడుతూ.. గ్రామానికి మంజూరైన 16 ఇళ్లకుగాను 13 మంది గ్రౌండ్, మూడు బెస్మెంట్ లెవెల్ పనులను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్ ఉన్నారు.


బడంగ్‌పేట్: మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్షం కార్మిక సంఘాలు


తుక్కుగూడ: ఫ్యాబ్‌సిటీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు


కందుకూరు: మానవహారంగా నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల కార్మికులు, ఉద్యోగులు

కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్రం

మహేశ్వరం: కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.దత్తునాయక్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. పని చేసే ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవేందర్, కార్మిక నాయకులు శివ, దేవేంద్ర, బ్రహ్మాచారి, చంద్రశేఖర్, భిక్షపతి, తేజ, రామకృష్ణ, వెంకటేష్, నర్సింహ, యాదయ్య, మోహన్, కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దయ్యేంత వరకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అలువాల రవికుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసిందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

తుక్కుగూడ: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.దత్తునాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత సార్వత్రిక సమ్మెను నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని మంఖాల్ పారిశ్రామికవాడ, ఫ్యాబ్‌సిటీ, హర్డువేరు పార్క్‌లో కార్మికులతో కలిసి బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కార్మికులు, కర్షకులపైన దాడులు పెరిగాయన్నారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు ప్రతి నెల రూ.26 వేల వేతనం అందజేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పి.దేవేందర్, ఎస్.యాదగిరి, దేవేందర్, బ్రహ్మాచారి, చంద్రశేఖర్, భిక్షపతి, తేజ, రామకృష్ణ, వెంకటేశ్, నర్సింహ, యాదయ్య, మోహన్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

బడంగ్‌పేట్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. అందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ, పీవైఎల్, ఆర్పీలు, ఆటో యూనియన్, మున్సిపల్ కార్మికులు, వృత్తి సంఘాలు ట్రాన్స్‌పోర్టు తదితర సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్ మాట్లాడుతూ.. శతాబ్ది కాలంగా కార్మిక వర్గాలు అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి.. వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. లేబర్ కోడ్‌లు అమలు అయితే కార్మికులు అన్ని హక్కులు కోల్పోయినట్టేనన్నారు. హక్కులు హరించే లేబర్‌కోడ్ బిల్లులు మాకొద్దని.. కార్మికులు సాధించుకున్న 29 చట్టాలనే అమలులో ఉంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు యాదగిరి, సీపీఎం జిల్లా నాయకులు గోరెంకల నర్సింహ, ఆర్పీ రాష్ట్ర కార్యదర్శి చంద్రకళ, ఆర్పీ జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి సరోజ, ఐద్వా మండల కార్యదర్శి అనురాధ, కవిత, రాధ, భాగ్యలక్ష్మి, స్వప్న, ధనలక్ష్మి, రవి, సునిత, పీవైఎల్ మండల కార్యదర్శి కొల్లూరు భీమేష్ తదితరులున్నారు.

మానవహారంగా ఏర్పడి నిరసన

కందుకూరు: సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో బుధవారం వివిధ సంఘాల కార్మికులు, ఉపాధి కూలీలతో కందుకూరు చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, శ్రామిక మహిళా కన్వీనర్ కవిత మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధిక రాణి, యశోద, షాజహాన్, శైలజ, ఆశా వర్కర్ల సంఘం నాయకులు సరస్వతి, సుశీల, భాగ్యలక్ష్మి, శ్రీలత, ప్రేమలమ్మ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు కె.శ్రీనివాస్, ప్రభావతి, రాణి, బాలమణి, అశ్విని, ఏఫ్‌ఏల సంఘం నాయకులు రాంపురం యాదయ్య, పి.యాదయ్య, నరసింహా, ఎస్.రాములు, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు రాములమ్మ, యాదమ్మ, భారతమ్మ, నరసింహ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

మహేశ్వరం: కంపెనీలలో పని చేసే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కు, ఐడీఏ మంఖాల్ పారిశ్రామికవాడ, విప్రో, మలబార్ కంపెనీల వద్ద ఐఎన్‌టీయూసీ, ఇతర కార్మిక సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులను అన్ని రంగాల్లో అణగదొక్కుతుందన్నారు. కార్మికులకు రావాల్సిన హక్కులను కాలరాస్తుందన్నారు. అంతకు ముందు కార్మికులతో కలిసి బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

మీర్‌పేట: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె మీర్‌పేట కార్పొరేషన్‌లో విజయవంతమైంది. సీఐటీయూ, ఏఐటీయూసీ, బీసీడబ్ల్యూ, ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని మున్సిపల్ కార్యాలయం నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు దాసరి బాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ చట్టాలను దీంతో పాటు పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగదీశ్, నర్సింహ, ఏఐటీయూసీ నాయకురాలు యాదమ్మ, యాదయ్య, ప్రకాశ్ పాల్గొన్నారు.


మహేశ్వరం: ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


మహేశ్వరం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ర్యాలీ


మహేశ్వరం: ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


మీర్‌పేట: సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

పాఠశాలల సమయాన్ని మార్చాలి

ఇబ్రహీంపట్నం: గతంలో పనిచేసిన మాదిరిగా పాఠశాలల సమయాన్ని మార్చాలని మండల విద్యాధికారి హీర్యానాయక్‌కు పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గతంలో మాదిరిగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3:35 గంటల వరకు మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లేష్, మహేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు

రోడ్డుపై గుంతల పూడ్చివేత

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి నుంచి కంది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం బుధవారం గుంతలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సమీపంలోని రెడిమిక్స్ ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడి, గుంతల్లో కాంక్రీటు వేయించారు. ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ సీఐ చేసిన పని పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో కృషి చేస్తున్నారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం జిల్లా మినరల్ ఫౌండేషన్ సంస్థ ద్వారా ప్రభుత్వం రూ.1.20లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో జిల్లేడ్‌చౌదరిగూడ మండలంలో రెండు, కేశంపేట మండలంలో నాలుగు, ఫరూఖ్‌నగర్ మండలంలో ఒకటి, నందిగామ మండలంలో మూడు చొప్పున అభివృద్ధి పనులను చేపడతామన్నారు. ఈ నిధులను పాఠశాల అదనపు తరగతి గదులు, సీసీ రోడ్లు, రహదారి నిర్మాణం పనులకు వినియోగించనున్నారని తెలిపారు. త్వరలో టెండర్లను పూర్తి చేసిన వెంటనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తూ నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు.

రైతులకు అండగా ప్రభుత్వం


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ హన్మంతరెడ్డి

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు అండగా ఉంటుందని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో రైతు వేదిక భవనంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పరికరాలను రాయితీపై అందిస్తుందని చెప్పారు. ఆధునిక పద్ధతిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే దిశగా కార్యక్రమాలు తీసుకుంటున్నారన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సాహెర్


తాపీమేస్త్రీలకు బహుమతులు అందచేస్తున్న భారతి సిమెంట్ నిర్వాహకులు

బడంగ్‌పేట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సాహెర్ తెలిపారు. బుధవారం బాలాజీ స్టీల్ అండ్ సిమెంట్ ట్రేడర్ డీలర్ షాపులో తాపీమేస్త్రీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బిడ్జీలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫస్ట్ వినియోగదాలకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్ కాంక్రిట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని అన్నారు. ఈ సందర్భంగా తాపీమేస్త్రీలకు రూ.లక్ష విలువ గల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ మహేందర్‌రెడ్డి, 50 మంది తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం


మహేశ్వరం: ఏబీవీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్యకర్తలు

మహేశ్వరం: విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ(అఖిల భారతీయ విద్యార్థి పరిషత్) నిరంతరం పోరాడుతుందని సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.శివ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్తూ విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందిస్తూ ఏబీవీపీ పని చేస్తుందన్నారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేష్, పూర్వ కార్యకర్తలు దేవేందర్, సుధీర్, రాఘవేందర్, వంశీ, కార్యకర్తలు సయూద్, అభిలాష్, ప్రణీత్, శ్రీకాంత్, సాయికార్తీక్, మనీష్, నిఖిల్, సన్నీ, రోహిత్, దుర్గా, గణేష్, భాను తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు

మీర్‌పేట: ఏబీవీపీ ఎన్నో నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు చేపడుతోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా బుధవారం బాలాపూర్ చౌరస్తాలో సతీష్ ఏబీవీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. యువతలో జాతీయ భావాన్ని నింపడంతో పాటు 76 ఏళ్లుగా విద్యారంగం, స్థానిక సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. 1అనంతరం కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నీరజ్, యువరాజు, శివ, సంగెం మధు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


కందుకూరు చౌరస్తాలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు


మీర్‌పేట: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

కందుకూరు: కందుకూరులో ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి భానుప్రసాద్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. జాయింట్ సెక్రటరీ అమరేందర్, నాయకులు లక్ష్మణ్, జ్యోతిప్రసాద్, వినయ్, కిరణ్, పూర్వ కార్యకర్తలు పాల్గొన్నారు.

దైవ స్మరణతో సమస్యలు దూరం

- బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి
- ఘనంగా కొనసాగుతున్న గురుపౌర్ణమి వేడుకలు


పాల్గొన్న భక్తులు


ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బుధవారం రెండో రోజు గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా కొనసాగాయి. బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ఉదయం స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహానికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురూజీ ప్రవచనాలు చేశారు. భక్తులు భగవంతుడి మంత్రజపం ద్వారా తమ సమస్యలను తామే ఎలా పరిష్కరించవచ్చో ఉపదేశించారు. సాధనతో భగవంతుడి కృపతో పాటు మానసిక స్థైర్యం పెరుగుతుందన్నారు. నిత్యం కొంత సమయాన్ని దైవ స్మరణకు కేటాయించాలని సూచించారు. గురువారం గురుపౌర్ణమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.

రోహింగ్యాలపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శంకర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి తదితరులు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలోనే రోహింగ్యాలు దేశంలోకి ప్రవేశించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం బడంగ్‌పేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శరణార్థులుగా వచ్చిన రోహింగ్యాలు నేడు ఇక్కడి నాయకులను చంపే కుట్రలకు తెగపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్రిమినల్ చర్యలకు హత్యలకు పాల్పడుతున్న ఈ రోహింగ్యాలు హైదరాబాద్‌లోని బాలాపూర్ నుంచి తరిమివేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రోహింగ్యాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో జవాబు చెప్పాలని ప్రశ్నించారు. బాలాపూర్‌లోని డైమాండ్ హోటల్ దగ్గర ఎర్రకుంట నివాసి యువకుడు రోహింగ్యాల చేతిలో హత్యకు గురయ్యాడని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎం పార్టీకి తొత్తులుగా మారిపోయారని ధ్వజమెత్తారు. బేషరతుగా రోహింగ్యాల వివరాలపై రేవంత్ సర్కారు శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ, చిత్తాపూర్, రంగాపూర్, చీదేడ్ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించనున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.